



ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా 341 కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 14,376 మెట్రిక్ టన్నులు

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

యాసంగి వరి కోతలు, ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ఊపందు కుంటున్నాయి. గడిచిన నాలుగైదు రోజులుగా కోతలు ముమ్మరం కావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎక్కువగా వస్తున్నది. రైతులు పండించిన ధాన్యాన్ని అంతటిని కొనుగోలు చేయడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గతంలో మాదిరిగానే ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 341 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని నిర్ణయించారు. ఈ కేంద్రాలన్నిటినీ ఇప్పటికే ప్రారంభించగా ఇప్పుడిప్పుడే కోతలు ముమ్మరం కావడంతో ఇప్పటి వరకు కేవలం 203 కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కేంద్రాలకు వరి ధాన్యం వచ్చిన వెంటనే మిగతా అన్ని కేంద్రాల్లో కూడా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ యాసంగిలో 2.50 లక్షల ఎకరాల వరిసాగు చేయగా 6.33,943 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో 2,51,099 మెట్రిక్ టన్నుల ధాన్యం విత్తనపంట కావడంతో ఆ ధాన్యాన్ని ఆయా కంపెనీలే కొనుగోలు చేస్తాయి. ప్రధానంగా హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో రైతులు విత్తన పంటను ఎక్కువగా సాగు చేశారు. మరో 2,307 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు స్వంత అవసరాలకు తమ వద్దే ఉంచుకుంటారని, సుమారు 30,500 మె.ట. ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. ఈ ధాన్యం పోను 3,50,000 టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించి వాటిని ఖరీదు చేయడానికి ఏర్పాట్లు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు 238 కేంద్రాలను, డిసిఎంఎస్ 47, హాకా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 32 ఐకేపీ, 143 ప్యాక్స్, 25 డిసిఎంఎస్, మూడు హాకా కేంద్రాలలో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు ఈ కొనుగోలు కేంద్రాలలో 2,325 మంది రైతులకు చెందిన 14,376 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం విలువ 31.67 కోట్లు. వీరిలో 596 మంది రైతులకు సంబంధించిన 3,438 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలను కంప్యూటర్లలో నమోదు చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల నుంచి 443 మెట్రిక్ టన్నుల ధాన్యం తమకు అందినట్లు మిల్లర్లు సమాచారం ఇవ్వగా 348 మె.ట. ధాన్యానికిగాను 77 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు ధాన్యం చేరగానే వెంటవెంటనే డబ్బు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల వ్యయ వివరాలను పారదర్శకంగా నమోదు చేయండి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్వినీకుమార్ పాండే

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: ఎన్నికల వ్యయ వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఎంసిఎంసి కమిటీ సభ్యులకు కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్వినీకుమార్ పాండే సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రకటనలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. అలాగే పెయిడ్ ఆర్టికల్స్‌ను పర్యవేక్షిస్తూ వ్యయవివరాలను నమోదు చేయాలని అన్నారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన కేసుల వివరాలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సువిధ పర్మిషన్లకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని అనుమతులు ఇచ్చారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్, డిడి ఇన్‌ఫర్మేషన్ ఇంజనీర్ కొండయ్య, ఎపిఆర్‌వో వీరాంజనేయులు, కంట్రోల్ రూమ్ నోడల్ ఆఫీసర్ ఎస్.నాగార్జున, పోలీస్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల బకాయిల విడుదల పట్ల బీజేపీ హర్షం

- బండి సంజయ్ పోరాట ఫలితమే
- సిరిసిల్ల బీజేపీ నాయకులు

కరీంనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్): నేతన్నల బకాయిల విడుదల పట్ల బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, రాజన్న సిరిసిల్ల బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప రామకృష్ణ, గోపి, ఆడెపు రవీందర్‌లు హర్షం ప్రకటించారు. సిరిసిల్ల నేత కార్మికులకు ఇంకా రావాల్సిన రూ. 301 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేసిందన్నారు. బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన యజమా నులకు సైతం ప్రభుత్వం నుంచి సక్రమంగా పేమెంట్లు రాకపోవడంతో 270 కోట్ల మేర బకాయిలు పేరుకు పోయాయన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కొత్త ఆర్డర్లు ఇచ్చి నేత కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాల న్నారు. పవర్ లూం కార్ఖానాలకు 30 సంవత్సరాల నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను పునరుద్ధరించాలని, కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభం నుంచి అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీటిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో బీజేపీ పక్షాన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం
- ప్రశాంతంగా జరిగేందుకు ప్రత్యేక దృష్టి
- పక్కాగా ఎన్నికల నియమావళి అమలు
- కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాం తంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియపై తీసుకున్న చర్యలను



మాట్లాడుతున్న కలెక్టర్

మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియో జకవర్గ పరిధిలో 17లక్షల 96వేల మంది ఓటర్లుండగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 50వేల అధికంగా ఉండడం విశేషమని చెప్పారు. 18,19 ఏళ్ల వయసు కలిగిన 46వేల మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారని అన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్దులు 13,200 మంది ఉన్నారని చెప్పారు. 41,500 మంది దివ్యాంగులు ఉన్నారని, వీరి కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. 8,552 ఈవీఎంలను ఎన్నికల్లో ఉపయోగిస్తున్నామని అన్నారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చిందని తెలిపారు. అత్యవసర సేవల్లో భాగంగా విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును 12-డి ఫారం ద్వారా వినియోగించు కుంటారని అన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని ఖచ్చింగా పాటించాలని, ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి హెచ్చరించారు. ఎన్నికల నియమావళిపై సీ విజిల్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటి వరకు 68 ఫిర్యాదులు రాగా వాటిపై చర్యలు తీసుకున్నామని అన్నారు. సువిధ పోర్టల్ ద్వారా సభలు, సమావేశాలు ప్రచారానికి సంబంధించి అనుమతుల కోసం 168 దరఖాస్తులు రాగా 105 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని, 48 గంటల్లో దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా ఫిర్యాదులుంటే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని తెలిపారు. పోలీసు తనిఖీల్లో భాగంగా దాదాపు 7 కోట్ల వరకు నగదు స్వాధీనం చేసు కున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, డిఆర్‌వో పవన్‌కుమార్, సమాచార పౌరసంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ కొండయ్య, ఏపిఆర్‌వో వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ : కలెక్టర్

కరీంనగర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికీ ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలతో పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఓటరు జాబితాను ర్యాండమ్‌గా రాజకీయ పార్టీల నేతలు చెక్ చేసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల పేర్ల మార్పు, స్థల మార్పిడి అదనంగా ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌ల అంశాలపై మాట్లాడారు. ఇంటింటికీ ఓటర్లు స్లిప్పులు పంపిణీ చేసే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిదులు సిబ్బందితో వెంట ఉండి ఓటరు జాబితాలను చెక్ చేసుకోవాలన్నారు. జిల్లాలో బెల్టు షాపులు మూసివేశామని, గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలను ఆయా రాజకీయ పార్టీ నేతలు పాటించాలన్నారు.

పొన్నం వ్యాఖ్యలు ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- బీజేపీలో చేరిన హుస్నాబాద్ నియోజకవర్గంలోని తాజా మాజీ సర్పంచులు

కరీంనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోర్టులపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజక వర్గంలోని అక్కన్నపేట మండలంలోని పలువురు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి 500 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇస్తే శరత్‌చంద్రారెడ్డికి బెయిల్ వచ్చిందంటూ పొన్నం చేసిన వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. న్యాయ స్థానాలపై, చట్టాలపై నమ్మకం లేకుండా మంత్రి హోదాలో కోర్టును కించపరచడంపై న్యాయపరంగా ముందకు వెళ్తామన్నారు. ఈ విషయమై జాతీయ పార్టీ దృష్టికి తీసుకు వెళుతామన్నారు. కోర్టుకు సైతం అవినీతిని అపాదించడం క్షమించరాని నేరమన్నారు.



బీఆర్ఎస్ హుస్నాబాద్ ప్రజా ప్రతినిధులకు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

కోర్టులపై, చట్టాలపై వాళ్లకు గౌరవం లేదన్నారు. ఎంతో మంది కాంగ్రెస్ నాయకులు జైలుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నారన్నారు. అంత మాత్రాన కోర్టుపై అబాండాలు వేస్తారా అని ప్రశ్నించారు. జాతీయ పార్టీకి దృష్టికి తీసుకువెళ్లి న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్వింటాలుకు వరికి 500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీ ఏమైందన్నారు. క్వింటాలుకు 500 బోనస్ ఇస్తే ఎకరాకు 14 వేల రూపాయలు బోనస్ ఇవ్వాలన్నారు. తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లు కొంటామని చెప్పి క్వింటాలుకు 8 కిలోల తరుగు తీస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ అగస్టులో చేస్తామంటే నమ్మేదెవరన్నారు. బీఆర్ఎస్ పాలనలో సర్పంచుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆత్మహత్యలకు సిద్ధమయ్యారన్నారు. బిల్లులు రాక సర్పంచుల ఆవేదనను గమనించి వారి పక్షాన పోరాటం చేశామన్నారు. సర్పంచులు సమస్యలపై అప్పటి సీఎం, ప్రస్తుత సీఎంలకు లేఖలు రాశామన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు ఏమీ తేడా లేదన్నారు. మోదీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులివ్వడం వల్లే పంచాయతీ సిబ్బందికి జీతాలివ్వగలుగుతున్నారన్నారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసి తాజా మాజీ సర్పంచులు బీజేపీకి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన భారతదేశానికి అతి పెద్ద పండుగ పార్లమెంట్ ఎన్నికలే అన్నారు. పోలింగ్ సరళి పరిశీలిస్తే బీజేపీ ఊహించినదానికంటే ఎక్కువ స్థానాల్లో గెలువబోతున్నామని తేలిపోయిందన్నారు. దేశమంతా నరేంద్ర మోడి గాలి వీస్తుందని, బీజేపీకి 370కి పైగా సీట్లు రావడం ఖాయమైపోయిందని, ఎన్డీఏ కూటమికి 400 స్థానాలకంటే ఎక్కువ రావడం తథ్యమన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చాలా చోట్ల డిపాజిట్లు గల్లంతు కాబోతున్నాయన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 20 మంది టచ్‌లో ఉన్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని కేసీఆర్ అంటున్నారని, బీఆర్ఎస్ నుండి 25 మందికిపైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని బీఆర్ఎస్ దుకాణం మూతపడటం ఖాయమని సీఎం అంటున్నాడన్నారు. ఈ రెండు పార్టీలు కూల్చడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రైతుల కోసం బీఆర్ఎస్ పార్టీపై నిరంతరం బీజేపీ పోరాటం చేసిందన్నారు.

హుస్నాబాద్‌లో పిచ్చాసుపత్రి ఏర్పాటు చేయండి

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని ఈ ప్రాంతంలో ఒక పిచ్చాసుపత్రి ఏర్పాటు చేయాలని బండి సంజయ్‌కు తాజా మాజీ సర్పంచులు వినతిపత్రం అందించారు. మంత్రి మాదిరిగానే కాంగ్రెస్ నాయకులు మితిమీరి మాట్లాడుతున్నారని, హుస్నాబాద్‌లో ప్రాంతంలో ఒక పిచ్చి ఆసుపత్రి ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని వినతిపత్రంలో కోరారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని అక్కన్నపేట మండలానికి చెందిన తాజా మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. బీజేపీలో చేరుతున్న నాయకులకు బండి సంజయ్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



గరుడవాహన సేవలో స్వామివారు

ఘనంగా గరుడవాహన సేవ

ఇల్లందకుంట, ఏప్రిల్ 19: ఇల్లందకుంట శ్రీసీతా రామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూ ర్తులను గరుడ వాహనంపై అధిరోహించారు. డప్పుచప్పుళ్లతో ఆలయ ప్రాంగణంలో స్వామివారిని ఊరేగించారు.

మంత్రి పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయాలి

- రాష్ట్ర మంత్రి పొన్నంకు బీజేపీ నాయకుల సవాల్
- బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ తరపున నామినేషన్ దాఖలు

భగత్‌నగర్, ఏప్రిల్ 19: రాష్ట్ర మంత్రి పదవికి రాజీనామా చేసి కరీంనగర్ ఎంపీగా పోటీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీజేపీ నాయకులు సవాల్ విసిరారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ తరపున నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి పమేలా సత్పతికి బీజేపీ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ డి శంకర్, బండ రమణారెడ్డి అందించారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దమ్ముంటే పొన్నం మంత్రి పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయాలని ఎవరికి ప్రజాదరణ ఉందో తేలిపోతుందన్నారు. పొన్నంను చూసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా భయపడి దగ్గరకు రావడం లేదన్నారు. ఆయనను మంచి డాక్టర్‌కు చూపించాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. కొద్ది రోజులుగా బీజేపీపైనా బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పొన్నం తీరు చూస్తే ఆయనకు మతి తప్పిన ట్లుందన్నారు. పిచ్చి మాటలు కాకుండా నేరుగా దమ్ముంటే ఆయనే స్వయంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. సుప్రీంకోర్టుపైనే అవినీతి ఆరోపణలు చేస్తున్నాడంటే ఏమనాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు పొన్నం వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని నోటీసులు జారీ చేయాలని కోరారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే మంత్రి పదవికే ఎసరొస్తుందనే భయం పట్టుకుందన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

మోదీ నియంతృత్వ పాలన పోవాలని ప్రజలు కోరుకుంటున్నారు

- బీఆర్ఎస్, బీజేపీ రైతుల పట్ల మొసలి కన్నీరు
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 19 : ప్రజలంతా మోదీ నియంతృత్వ ప్రభుత్వం పోవాలని కోరుకుంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డీసీసీ అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి శుక్రవారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ చేశారు. ఇండోర్ స్టేడియం, యోగా సెంటర్లో క్రీడాకారులతో కలిసి ఆడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మంత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ నియంతృత్వ పాలన పోవాలని, మానవతావాది అయిన రాహుల్ గాంధీ నాయకత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వివిధ సంస్థల నుంచి నల్లధనాన్ని తీసుకునేందుకు ఎలక్ట్రోరల్ బాండ్లను రూపొందించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పడం నేరుగా అవినీతిని ప్రోత్సహించినట్లే అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ప్రత్యేకంగా తీసుక వచ్చిన నిధులు ఏమీ లేవన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కూలిపోతుందని శాపనార్థాలు పెడుతున్నాడని, ఇంత ఈర్ష ఎందుకని ప్రశ్నించారు. స్థానిక ఎంపీ ప్రసాద్ స్కీం కింద నాలుగు ప్రముఖ దేవాలయాలకు ఒక్క రూపాయి కూడా ఎందుకు తేలేకపోయాడని, దీనిపై సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఆగస్టు 15 తర్వాత రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడంతో పాటు వచ్చే వర్షాకాలంలో 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలు అమలు చేసే బాధ్యత మాదేనన్నారు. బండి సంజయ్, గంగుల కమలాకర్‌ల మధ్య ఉన్న స్నేహం అందరికీ తెలిసిందేనని, వినోద్‌రావును ఓడించేందుకు కమలాకర్ సంజయ్‌తో ఏ విధంగా కుమ్మక్కు అయ్యిండో తెలుసని, స్మార్ట్ సిటీ అవినీతి విషయంలో, అభివృద్ధి పనుల విషయంలో ఒకరినొకరు ఎందుకు ప్రశ్నించుకుంటలేరో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గారు మాట్లాడుతూ బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతూ గుడిలో ఉన్న దేవుడిని బజారులోకి తెచ్చారన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ రాముడి ఫోటోలు బీజేపీ వద్ద ఉంటే... రాముడి ఆత్మ కాంగ్రెస్ పార్టీ వైపు ఉందన్నారు. బండి సంజయ్ ఎంపీ లాడ్స్ నుంచి కేవలం ఐదు కోట్ల రూపాయలను మాత్రమే ఖర్చు పెట్టాడని, మిగతా ఎంపీలు వారి కోటా నుంచి 8 నుంచి 16 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టార న్నారు. కరీంనగర్‌లో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం మూడు సంవత్సరాలలో పూర్తి చేయాలనుకుంటున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ల్యాండ్ మంజూరు చేయించి, నా వంతు కోటి రూపాయల విరాళం ఇస్తానని రాజేందర్‌రావు ప్రకటించారు. మార్నింగ్ వాక్‌లో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేష్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ 2,6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి మే3 వరకు జరుగుతాయని పరీక్షలు నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలపై బండరాయి పడి ముగ్గురికి గాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: మండలంలోని సుద్దాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. మట్టి తవ్వుతుండగా పైనుంచి పెద్ద బండరాయి పడడంతో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. మరి కొందరు తృటిలో ప్రాణాలు కాపాడుకున్నారు. సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సుద్దాలలోని పెద్దమ్మ కుంట వద్ద 160 మంది కూలీలు కొన్ని రోజులుగా పూడిక తీత పనులు చేస్తున్నారు. శుక్రవారం కూడా వారు పని చేస్తుండగా పై నుంచి పెద్ద బండరాయి కూలీలపై పడింది. బుర్ర స్వరూప, కలువల లింగమ్మ, తార అనే ముగ్గురు మహిళలు గాయపడ్డారు. వెంటనే వీరిని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సుల్తానాబాద్ అస్పత్రికి తరలించారు. అనంతరం ముగ్గురిని ఎంపీడీవో కరీంనగర్ అస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. వీరిలో తార, లింగమ్మ లకు మామూలు గాయాలు కాగా బుర్ర స్వరూపకు నడుముకు గాయం కావడంతో అమెకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారని తెలిపారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో అన్నారు. అస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కాంగ్రెస్ నాయకుడు మినుపాల ప్రకాష్‌రావు పరామర్శించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

పిడుగు పడి రైతు కూలీకి తీవ్రగాయాలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 19: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెంది న కోరుట్ల రమేష్ అను రైతు కూలీ శుక్రవారం సాయంత్రం పడ్డ పిడుగు పాటుకు తీవ్రగాయాలపాలయ్యాడు. గ్రామంలోని కోరుట్ల రమేష్ వ్యవసాయ కూలీ పనులను చేసుకుంటూ జీవనం కోనసాగిస్తున్నాడు. శుక్రవారం సాయం త్రం కూలీ పనులు ముగించుకోని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఈదురు గాలులు, ఉరుములతో కూడి చినుకులు కురిసింది. చినుకులు పడుతుందని రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్కకాడం ఊడిపోవడంతో రమేష్ కాలు, చెయికి తీవ్రగాయల పాలవడంతో పాటు పిడుగు పాటుకు ఆయన ఒంటి బలమైన గాయాలు తలిగినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం మెట్‌ప ల్లి అసుపత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్న అతనికి తీవ్రగాయల పాలైనం దుకు ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామానికి చెం దిన పారిపెల్లి రాజిరెడ్డికి చెందిన ఆవు పిడుగుపాటుతో మృతిచెందింది. రాజు తన పాడి ఆవును శుక్రవారం వ్యవసాయ బావివద్ద కట్టివేసి రాగా సాయం త్రం పడిన పడిగుపాటుతో మృతిచెందింది. దీనితో తనకు రూ 80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాజిరెడ్డి విల పిస్తు కోరాడు.

విద్యుదాఘాతంతో గేదె..

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కొక్కు గణేష్ తన గెదలను మోపడానికి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేతంకు వెల్లినట్లు తెలిపారు. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్ పార్మర్ వద్ద మోస్తుండంగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినుట్ల గ్రామస్థులు తెలిపారు. కాగా యజమాని గణేష్ సుమార్ రూ. 50000 వరకు నష్టం వాటిలినట్లు బాదితుడు తెలిపాడు. బాదితుడిని ప్రభుత్వ పరంగా అదుకోవాలని గ్రామస్థులు కొరుతున్నారు.

పాముకాటుకు ఎద్దు..

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మాటేటి పర్వతాలు అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పాటుకాటుకు గురై మృతి చెందింది. పొలం వద్ద గడ్డి మేస్తున్న తరుణంలో పాటుకాటుకు గురైంది. పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించగా స్పందించి వైద్యం చేసినా అప్పటికే మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు 60 వెల వరకు ఉంటుంది.

ఆలయంలో చొరబడి ఫొటోలు, తులసి గద్దె విసిరివేత

● అన్యమతస్థుల పనేనని అనుమానం
● హనుమాన్ మాలధారుల ఆందోళన
● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
● విచారణ చేపట్టిన పోలీసులు





పొలంలో పడవేసిన వేంకటేశ్వర స్వామి చిత్రపటం, విచారణ జరుపుతున్న ఎస్సై ఉమా సాగర్

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని జగదేవ్‌పేట నగారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకతాయిలు ఆగడం సృష్టించారు. ఆలయంలో ఉన్న వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి చిత్రపటాలను, తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేయడం కలకలం సృష్టించింది. వివరాలలోకి వెళ్లితే... జగదేవ్‌పేటలోని నగారా వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం హనుమాన్ మాలధారులు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పెట్టుకొని పూజలు నిర్వహిస్తూ రాత్రి అక్కడే బస చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం లక్ష్మీపూర్ ఆలయానికి దర్శనార్థం వెళ్లారు. అదను చూసుకున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి ఆలయంలోని వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ చిత్రపటాలతో పాటు ఆలయం ముందు ఉన్న తులసి గద్దెను సమీపంలోని పొలంలో విసిరివేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన హనుమాన్ మాలధారులు దేవుళ్ల చిత్రపటాలు పొలంలో పారవేయడం చూసి ఆందోళన చెందారు. ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్యకు, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డిలకు సమాచారం ఇచ్చారు. మాలధారులు, మరికొందరు కలిసి వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వేలి ముద్రలు సేకరించారు. కాగా ఈ పని చేసింది అన్యమతస్తులేనని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆలయ చైర్మన్ కొర్రి గంగయ్య, మాజీ సర్పంచ్ లింగమ్మ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి హనుమాన్ దీక్ష పరులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో హిందూ దేవాలయాలు, హనుమాన్ దీక్ష పరులను అవమానించడం ఎక్కువగా జరుగుతోందని బీజేపీ నాయకుడు కొమ్ము రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

స్కూల్ ఆటో బోల్తా

రామగిరి, ఏప్రిల్ 19: మండలంలోని రత్నాపూర్ గ్రామసమీపంలో కారు ఢీకొట్టిన ప్రమాదంలో స్కూల్ ఆటో బోల్తాపడింది. సెంటినరీకాలనీ నుంచి నాగే పల్లి వైపు టిఎస్22 టిఏ 2087 నంబరు గల ఆటోలో ప్రైవేట్ స్కూల్ విద్యా ర్థులను తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో విద్యార్థులతో ఉన్న ఆటో పల్టీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ నరివెద్ది సంపత్‌కు ఎడమ కాలు ఫ్రాక్చర్ కాగా, విద్యార్థులకు గాయాలు కాలేదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆరో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వి.శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొత్తం 16,557 మంది విద్యార్థులకు గాను 16,003 మంది విద్యార్థులు హాజరు కాగా 554మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు ఏమీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

పాలీసెట్ దరఖాస్తుకు 22 వరకు గడువు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-24) రాసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు కరీంనగర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆదర్శ మహిళా రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిం చారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఎనిమిది మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా అందులో ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మిగతా ఐదుగురు వ్యక్తులకు 10 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో రూ.15.81లక్షల నగదు సీజ్





కరీంనగర్‌లో సీజ్ చేసిన నగదును చూపిస్తున్న సీఐ సరిలాల్, వేములవాడలో నగదు స్వాధీనం చేసుకున్నట్టు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం కరీంనగర్‌లోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని 15 లక్షల 81 వేల 900 రూపాయల నగదును పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్ చౌక్ వద్ద కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జలగం సుమన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న ఏడు లక్షల నగదును సీజ్ చేశారు. కరీంనగర్ రెండో ఠాణా పరిధిలోని ఇందిరా చౌక్ వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్(కపిల్ చిట్‌ఫండ్స్) వద్ద 1,11,900 రూపాయలు, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన కొల ప్రదీప్ కుమార్ వద్ద 5,70,000 రూపాయలు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ మూడో ఠాణా పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో కట్టరాంపూర్‌కు చెందిన గాండ్ల సురేష్‌వద్ద 2 లక్షల రూపాయలను స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన మొత్తం నగదును తదుపరి సీజర్ కమిటీకి స్వాధీనం చేశామని సీఐలు సరిలాల్, విజయ్ కుమార్, జాన్‌రెడ్డిలు తెలిపారు.

● వేములవాడలో 5.67 లక్షలు పట్టివేత..

వేములవాడ: వేములవాడ పట్టణంలో తగిన పత్రాలు లేకుండా తీసుకువెళుతున్న ఐదు లక్షల 67 వేల రూపాయల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తనిఖీల సందర్భంగా నంద్యాడపు నర్సయ్య అనే వ్యక్తి వద్ద ఐదు లక్షల 67 వేల రూపాయలు పట్టుబడ్డాయని తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్టు తెలిపారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం



చిన్నమల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఓ వైపు అప్పులు చేసి పంట సాగు చేస్తే తెగుళ్ల సోకి దిగుబడి రాదనే ఆందోళన.. మరో వైపు ఇంటి భవన నిర్మాణానికి తెచ్చిన బాకీలు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందిన అన్నదాత నెత్తెట్ల చిన్నమల్లయ్య(48) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు చిన్నమల్లయ్య తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని యేడాది కిందట మూడు లక్షల రూపాయలు అప్పులు చేసి చదును చేశాడు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో మరో రూ.1.50 లక్షలు అప్పు తీసుకువచ్చి వరి పంట వేశాడు. పంటకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గుతోందని ఆందోళన చెందాడు. ఇటీవల రూ. 10.50 లక్షలు అప్పులు చేసి ఇంటి భవన నిర్మాణాన్ని చేపట్టాడు. బాకీలు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన చిన్నమల్లయ్య ఈ నెల 18న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో గొర్రెల కాపారులకు వ్యవసాయ పొలం సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడ చేరుకుని చిన్నమల్లయ్యదీగా గుర్తించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కొడుకు అజయ్, కూతురు అమూల్య ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

స్కూల్ యూనిఫాంల తయారీలో నాణ్యత పాటించాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు



సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో క్లాత్ తయారీని పరిశీలిస్తున్న మల్లయ్యభట్టు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంల వస్త్రాలను నాణ్యతప్రమాణాలతో తయారు చేసి అందించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మలయ్యభట్టు అధికారులకు సూచించారు. సిరిసిల్ల పట్టణంతో పాటు తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్న ఆర్వీఎం వస్త్రాలతో పాటు చంద్రంపేటలోని గౌడ సైజింగ్‌లను శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి మల్లయ్యభట్టు సందర్శించి తయారుచేసిన వస్త్రాలతో పాటు తయారీ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్కులో తయారు చేస్తున్న స్కూల్ యూనిఫాం వస్త్రాల తయారీతో పాటు వాటిలో ఉండే నాణ్యతలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, టెస్కో జనరల్ మేనేజర్ ఎల్ వెంకటేశ్వర్‌రావు, చేనేత జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జెండర్, ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఈఈ అనిత తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మలయ్యభట్టు

● కస్తూర్బాగాంధీ పాఠశాలల తనిఖీ..

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూర్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలను శుక్రవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లయ్యభట్టు ఆకస్మికంగా సందర్శించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనాలను పరిశీలించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు వసతులను కల్పించి చూసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనాలతో పాటు వసతులను అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల పాఠశాలకు మంజూరైన అదనపు అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీడీ రమేష్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర సీఎంవో జోసెఫ్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, పద్మజ, పాఠశాల ప్రత్యేక అధికారి పావనిలు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 19: వేములవాడ మండలం అనుపురం ముంపు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పరును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు రూరల్ తహసీల్దార్ సుజాత శుక్రవారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ముంపు గ్రామాల పరిధిలోని గ్రామాల భూముల్లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఒక్క టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: మండలంలోని నలుగురు వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కరునాథం శివకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త లింగారెడ్డి, బొల్లం రాజు, తిప్పరవేణి చంద్రశేఖర్, ధర్మ శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో ఉద్యోగాలు ఇప్పిస్తానని సిరిసిల్ల పట్టణానికి చెందిన శివకృష్ణ 2018లో రూ 6.50లక్షలు తీసుకున్నాడు. శివకృష్ణ వ్యవసాయశాఖలో అటెండర్‌గా పనిచేస్తుండటంతో నమ్మి డబ్బులు ఇచ్చామని 2013లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హైద్రాబాద్‌లో ఉంటున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిరుద్యోగులు ఎవరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి
- 25 మందికి ఆస్పత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న విద్యార్థులు



హాస్టల్‌లోని సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 19: సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులకు అస్వస్థకు గురయ్యారు. హాస్టల్‌లో మొత్తం విద్యార్థుల సంఖ్య 480 మంది కాగా, గురువారం 372 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 20 మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి మొదలైంది. హాస్టల్‌లో సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. శుక్రవారం మరో ఐదు మంది విద్యార్థులకు కూడా ఇదే విధంగా వాంతులు, విరేచనాలు కావడంతో వారిని కూడా ఆస్పత్రికిలో చేర్చారు. పరీక్షలు ఉండడంతో కొంతవరకు కొలుకున్న వారిని శుక్రవారం ఉదయం హాస్టల్‌కు తరలించారు. పరీక్షల తర్వాత వారిని హాస్టల్‌లోని ఒక ప్రత్యేక గదిలో ఉంచి శుక్రవారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరగన్నం మాత్రమే అందించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, అవి తినలేని పరిస్థితిలో ఉన్నాయని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, కొందరు వాటిని పడవేశారని, తిన్న తమకు వాంతులు, విరేచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● రీజనల్ డైరెక్టర్ పరిశీలన...

హాస్టల్‌లో ఆహారం పడక కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న సోషల్ వేల్ఫేర్ శాఖ రీజనల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, హాస్టల్‌లో ఉన్న వారిని పరామర్శించారు. ఇలా ఎందుకు జరిగిందని ఆరా తీశారు.

● మెనూ ప్రకారం పెడుతున్నాం..

- సత్యప్రసాద్, ప్రిన్సిపాల్

మెనూ ప్రకారమే హాస్టల్‌లో భోజనం, టిఫిన్‌లు పెడుతున్నాం. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కూడా బోండాలు పెట్టాం. బోండా పిండి కొంచెం పలుచగా రావడం వల్లన నూనె ఎక్కువ పీల్చుకోవడంతో అవి కొందరికి పడకపోయి ఉండవచ్చు. నాకు సమాచారం రాగానే హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున సుల్తానాబాద్ వచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించాను. వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నాం. డిశ్చార్జీ అయి వచ్చిన విద్యార్థులకు డాక్టర్ల సూచనల మేరకు కేవలం పెరుగు అన్నం అందిస్తున్నాం.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

మేడిపల్లి, ఏప్రిల్ 19: మేడిపల్లి మండల కేంద్రంలో నీటి తొట్టిలో పడి బాలుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఒరిస్సాకు చెందిన బైగని సాబర్ అనే మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకొని నాలుగు నెలల క్రితం స్థానికంగా ఉన్న ఇటుక బట్టీలో పనిలో చేరింది. గురువారం సాయంత్రం పిల్లలతో కలిసి పరమేష్(7) నీటి సంపు వద్ద స్నానానివెళ్లి ప్రమాదవశాత్తు తొట్టిలో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు తీసి జగిత్యాల అసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రెండేళ్ల క్రితమే మృతి చెందాడు. మృతుడి తల్లి బైగని సాబర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని వంతెనపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి మండలంలోని పదిర గ్రామానికి చెందిన వ్యక్తి రెక్కల బుచ్చిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పదిరలోని వ్యక్తి బుచ్చిరెడ్డి తన ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన చింతం లక్ష్మి(74) అనే వృద్ధురాలు శుక్రవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన నయం కాకపోవడంతో మానసిక వేదనకు గురవుతోంది. మళ్లీ డాక్టర్ల చుట్టూ తిరగలేక, బ్రతుకు మీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్19: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ వద్ద కరీంనగర్-వేములవాడ రోడ్డుపై శుక్రవారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో శాంతినగర్‌కు చెందిన యువకుడు రాక్ విశాల్(19) దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాల్ తన బైక్‌పై కమాన్‌పూర్‌లోని బంక్‌లో పెట్రోల్ నింపుకుని తిరిగి శాంతినగర్‌కు వస్తున్న సమయంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు అతివేగంగా బైక్‌పై వెళ్తున్న భూమి రాకేష్ ఢీకొట్టాడు. దీంతో విశాల్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో రాకేష్‌కు కూడా గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదుతో కేసు విచారణ జరపుతున్నామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్ డిపోలో ఆరుగురిపై బదిలీ వేటు

హుజూరాబాద్, ఏప్రిల్ 19: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో పనిచేసే ఆరుగురి ఉద్యోగులపై శుక్రవారం వేటు పడింది. ఈ మేరకు ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎం సురికొంటి భూపతిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్20వేల రూపాయలు లంచం తీసుకుం టూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విధితమే. దీనికి స్పందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు. హుజూరాబాద్ డిపో కార్యా లయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది శ్రీకాంత్‌కు సన్నిహితంగా ఉన్నారని ఆర్టీసీ విజిలెన్స్ ఎంక్వైరీ అధికా రులు ఇచ్చిన నివేదిక మేరకు ఆరుగురిని కరీంనగర్ ఆర్ ఎం కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ అయిన వారి లో రాజమణి (డ్యూటీ చాటింగ్), వెంకటయ్య (బుకింగ్ క్లర్క్), సురేందర్ (సూపరింటెండెంట్), జాఫర్ (మెకానిక్ ఎల్వో), రవీందర్ (డ్రైవర్), శంకరపట్నం బస్టాండ్‌లో పనిచేసే స్వామిలను బదిలీ చేశారు. ఇదే డిపోలో మరో ఇద్దరిపై కూడా బదిలీ వేటు పడనున్నట్లు తెలిసింది.

తాటి చెట్లు దగ్ధం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం తాడూరు శివారులో అగ్ని ప్రమాదంలో తాటి చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామ శివారులోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గీతకార్మికులు సుమారు 500 తాటి చెట్లను పది సంవత్సరాలుగా సంరక్షిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రమాద వశాత్తు నిప్పు అంటుకొని మంటలు చెలరేగడంతో సుమారు 300 తాటి చెట్లు దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని గౌడ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ పరిశీలించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కాగా దగ్ధం అయిన చెట్లను కాంగ్రెస్ నాయకుడు పుర్మాణి లింగారెడ్డి, మీరాల శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న నిందితుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట వద్ద ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేటకు చెందిన కోల రవిగౌడ్ (46)ను శుక్రవారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇతను సిరిసిల్ల పట్టణంలోని సినారె గ్రంథాలయం, దామిని బార్ ఎదుట పార్క్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను చోరీచేసి ఒక వాహనాన్ని చెట్ల పొదల్లో దాచిపెట్టి మరో వాహనంపై తిరుగుతండగా పట్టుకున్నామని తెలిపారు. చోరీ చేసిన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని దొంగను కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

వెల్గటూర్, ఏప్రిల్ 19: మండలంలోని కిషన్‌రావుపేటలో శుక్రవారం డీఎస్పీ రఘుచందర్ ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. కిషన్‌రావుపేటకు చెందిన మెరుగు కొమురయ్య అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించాడని అదే గ్రామానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కొమురయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రఘుచందర్ కిషన్‌రావుపేటలో విచారణ చేపట్టారు. సాక్షులను విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్సై ఉమాసాగర్ ఉన్నారు.

కొండగట్టులో నత్తనడకన చిన్న జయంతి ఏర్పాట్లు



ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం

మల్యాల, ఏప్రిల్ 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న జయంతి ఏర్పాట్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జయంతి వేడుకలకు గాను ఇప్పటికే దాదాపుగా ఏర్పాట్లు పూర్తి కావాల్సి ఉండగా నత్తనడకన సాగుతున్నాయి. కొండపైన దీక్షపరులు, లడ్డూ ప్రసాదాల కోసం క్యూలైన్‌లు ఏర్పాటు కాగా మిగితా ఏర్పట్లు అంతంత మాత్రమే. విద్యుత్ లైట్స్, మైక్‌ల పనులు కావాల్సి ఉండగా చలివేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. భక్తులు నడిచి వచ్చే ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గంలో చేపట్టాల్సిన సౌకర్యాలు ప్రారంభించలేదు. జయంతికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు మాత్రం ఏర్పాటు చేశారు. లక్షలాదిగా తరలివచ్చే దీక్షపరులకు తగిన సౌకర్యాలను త్వరగా పూర్తిచేయాలని ఇటీవల కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా అడిషనల్ కలెక్టర్ నేతృత్వంలో మరోసారి సమపన్వయ సమావేశం నిర్వహించినా ఏర్పాట్లలో వేగం కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతన్నారు.



ఘాట్‌రోడ్డు వెంట లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వైభవంగా చెన్న కేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19: కరీంనగర్ మండలం చర్లభూత్కూర్ గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితులు సుధాకర్ శర్మ, కమలాకర్, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భూనీలా- శ్రీచెన్నకేశవ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజి సర్పంచు దబ్బెట రమణారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కూర నరేష్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అనంతరెడ్డి, మాసగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ క్యాంపు తరగతులను సద్వినియోగం చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఉన్నత ర్యాంకులను సాధించాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్యబట్టు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నగరంలోని సప్తగిరికాలనీ కేజీబీవీలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో ఏమైనా అనుమానాలుంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలని, కష్టపడి చదివి రాబోయే తరాలకు మార్గదర్శకులుగా నిలిచి తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కేజీబీవీ విద్యార్థులు చాలా పేదరికం నుండి వస్తారని, వారిని మన స్వంత బిడ్డల్లా చూసుకొని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ కో ఆర్డినేటర్ డాక్టర్ డెబోరా కృపారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పుష్పరాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 19: కొత్తపల్లి మండలంలోని చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్ గ్రామాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ఊట్కూరి రాధకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సంచార వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పేదలు, వృద్ధులు, మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, ఎంఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19: సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. శుక్రవారం వరల్డ్ లివర్ డే సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆహారాన్ని మితంగా తీసుకుంటూ ప్రతి రోజు ఒక గంట వ్యాయామం చేయాలన్నారు. ముఖ్యంగా లివర్ పనితీరును బట్టే శరీరంలోని జీవక్రియలు, జీర్ణక్రియ సక్రమంగా పనిచేస్తాయన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం మెడికవర్ డాక్టర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ అతిగా మద్యం తీసుకోవడం వల్ల లివర్ దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కార్పొరేటర్ మేచినేని వనజ, అశోక్‌రావు, మేచినేని పవన్‌రావు, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దంపతులు

చొప్పదండి, ఏప్రిల్ 19: ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం చొప్పదండిలో క్యాంపు కార్యాలయంలో ఆయన పూజలు నిర్వహించి కార్యాలయాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నేరుగా తనకు సమస్యలను తెలుపవచ్చని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ప్రజలు మధ్యవర్తులను సంప్రదించకుండా తనను నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలి

గంగాధర, ఏప్రిల్ 19: పేద ముస్లింల అభివృద్ధికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సంచార ముస్లిం జిల్లా అధ్యక్షుడు దావుద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శుక్రవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షబ్బీర్, రాష్ట్ర నాయకుడు షాదుల్లా, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 19: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నాయకులు పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ధాన్యం తూకంలో మోసాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బేతి రాజిరెడ్డి, మహంకాళి కొమురయ్య, శ్యామకూర సంపత్‌రెడ్డి, గోగురి కృష్ణరెడ్డి, ముస్కుల కిష్టరెడ్డి, బుద్ది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఏప్రిల్ 19: మండలంలోని పర్లపల్లిలో నాగులమ్మ స్థిరప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదాడి భారతి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న

గణేశ్‌నగర్, ఏప్రిల్ 19: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న అన్నారు. 37వ డివిజన్ రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఓపి హెచ్‌సి అర్బన్ సప్తగిరి కాలనీ మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం స్పందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న, ఏడబ్ల్యూటీ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న మాట్లాడుతూ పిల్లల పెరుగుదల, పోషకా హార లోపంతో కలిగే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ సమా వేశంలో గర్భిణులు, బాలింతలు, పలువురు కిశోర బాలికలు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** మండలంలోని ఆయా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పోషణ స్థితి, ప్రీ స్కూల్ కార్యక్రమాల గురించి గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పల్లె దవాఖాన వైద్యులు శ్రీకాంత్ గర్భిణులకు పోషకాహారం, రక్తహీనత, ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం సుగుణ, ఆశ, వసంత, సీఏ మునీశ్వరి, అంగన్‌డీడీ టీచర్ స్వరూపరాణి, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

●**గంగాధర:** పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. శుక్రవారం గట్టుబూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు తగిన సమయంలో విటమిన్లు, ఖనిజ లవణాలున్న ఆహారాన్ని అందించాలన్నారు. ఈసందర్భంగా పిల్లలు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భవతులు, తల్లుల ఆరోగ్యంపై పల్లె వైద్యాధికారి శిరీష వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, అనంత లక్ష్మి, సరోజన, కార్యదర్శి శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** మండలంలోని కన్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఫ్రైడే గ్రామసభలో భాగంగా అన్యువల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లలు ఆట పాటలతో విద్యా సంబంధమైన కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సమావేశానికి హాజరైన ఏసీడీపీవో అరవింద మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకి అంగన్‌వాడీ ప్రీస్కూల్ సేవలు వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీలో ప్రీస్కూల్ పిల్లలకి ఆట పాటలతో విద్యను నేర్పిస్తామన్నారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నవారు అంగన్‌వాడీ స్కూల్‌కు తప్పకుండా పంపించాలన్నారు. కార్యక్రమంలో శ్వేత, సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, కాంత, ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'శ్మశానవాటిక పనుల్లో నాణ్యతాలోపం'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: నగరంలోని పాత బజార్ శివాలయం సమీపంలో గల ముస్లిం శ్మశానవాటికలో నాణ్యత ప్రమాణాలను పాటించకుండా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారని, వాటిని రద్దు చేయాలని హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఎం.సతీష్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఇప్పటి వరకు చేసిన పనుల బిల్లులను చెల్లించవద్దని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు కవనభేరి పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 19: భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన కవనభేరి కవితా సంకలనాన్ని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు నూజెట్టి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణకు కవి, శాసన, చారిత్రక పరిశోధకుడు, శ్రీనాథ కవి వంశీకుడు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ ముఖ్య అతిథిగా హాజరౌతారని పేర్కొన్నారు. అతిథులుగా వేటపాలెం మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల విద్యాల ప్రిన్సిపల్ డాక్టర్ సి నారాయణస్వామి, యోగాచార్య సంపత్‌కుమార్, ఆసిఫాబాద్ ఆర్టీసి సూపరెండెంట్ మాడిశెట్టి శ్రీనివాస్ హాజరు కానుండగా భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖ మేనేజర్ సవ్యసాచి పుస్తక సమీక్ష చేయనున్నారని తెలిపారు. కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

భగత్‌నగర్, ఏప్రిల్ 19: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మోడల్‌ఈఏపిసెట్, నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం నగరంలోని మంకమ్మతోటలోని జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా చుక్క రామయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తు పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లలో 26 నుండి 28 వరకు మోడల్ ఈఏపిసెట్ ఆన్‌లైన్‌లో, నీట్ పరీక్ష 30వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు 8106351287, 8143091502, 9398636846 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, శ్రీజ, రోహిత్, వినయ్, సహాయ కార్యదర్శులు ఇశాక్, నాగుల శ్రీజ, బోగేష్ తదితరులు పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్19: కరీంనగర్ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గురువారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న బండారి శేఖర్

సుభాష్‌నగర్, ఏప్రిల్19: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి గార్డు కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందడంలేదని తెలిపారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ అధికారి కార్మికుల వేతనాలు విడుదలకు కమిషన్ ఆశిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, రాజు, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

'అంబులెన్స్ డ్రైవర్ల ఆగడాలను అరికట్టాలి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19: కరీంనగర్, మంచిర్యాలలోని ప్రైవేటు హాస్పిటల్స్, అంబులెన్స్ డ్రైవర్ల అగడాలను అరికట్టాలని హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీస్, జిల్లా కార్యదర్శి చింతపాటి అశోక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీష్ మాట్లాడుతూ కమీషన్లకు ఆశపడి పేషంట్ల ప్రాణాలతో చెలగాట మాడుతున్న అంబులెన్స్ డ్రైవర్లు, యజమా నులపై చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. మల్టీ స్పెషాలిటి పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేసి అర్హత లేని వారితో వైద్య అందిస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లు మధ్యవర్తులుగా విచ్చలవిడి వ్యాపారాలు చేస్తున్నారని వారు ఆరోపించారు.

'ఎన్నికల హామీలను నెరవేరుస్తాం'



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 19: ఎన్నికల హామీలను నెరవేరుస్తామని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన పథకాలను ప్రతి గడపకు చేరే విధంగా కార్యాచరణ తీసుకున్నామని తెలిపారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గతంలో ఎంపీగా, ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడిగా పూర్తిగా వైఫల్యం చెందాడని అన్నారు. సమావేశంలో నాయకులు ఎండి తాజ్, శ్రవణ్ నాయక్, బొబ్బిలి విక్టర్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, నేహాల్ అహ్మద్, కుర్ర పోచయ్య జీడి రమేష్, దండి రవీందర్ పాల్గొన్నారు.

బాలికల వసతిగృహంలో నీటి తిప్పలు

- అడుగంటిన బోరు
- వారం రోజులుగా విద్యార్థినుల ఇబ్బందులు



వసతి గృహంలో అడుగంటిన బోరు



వసతి గృహం ఆవరణలో పనిచేయని ఆర్వో ప్లాంట్

జమ్మికుంట, ఏప్రిల్ 19: జమ్మికుంట పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో నీటి తిప్పలు మొదలయ్యాయి. ప్రస్తుతం పరీక్షలు జరుగుతుండటంతో విద్యార్థినులులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 40మంది విద్యార్థినిలు వసతిగృ హంలో ఉంటున్నారు. వారం రోజుల క్రితం విద్యుత్ మోటర్ కాలిపోవడంతో వార్డెన్ లక్ష్మి మరమ్మతులు చేపించారు. కానీ మోటారు నుంచి నీరు రాకపోవ డంతో బోరులో నీరు అడుగంటినట్లు గుర్తించి ఉన్న తాధికారులకు సమాచారం అందించారు. నాలుగు రోజుల నుంచి మున్సిపల్ అధికారులు ట్యాంకర్లు పంపించారు. శుక్రవారం సమయానికి నీటి ట్యాంకర్ రాకపోవడంతో పరీక్షకు ఆలస్యం అవుతుందని విద్యా ర్థినులు ఆందోళన చెందారు. సమీపంలో ఉన్న డిగ్రీ మహిళ వసతి గృహానికి వెళ్లి స్నానాలు చేసి వచ్చా రు. బోరులో నీరు లేక ఆర్వో ప్లాంటు కూడా పని చేయడం లేదు. బయటి నుంచి తాగునీరు తీసుకువస్తున్నారు.

నీటి సమస్య లేకుండా చూస్తున్నాం
- లక్ష్మి, వార్డెన్

నీటి సమస్య అనుకోకుండా వచ్చింది. మున్సిపల్ అధికారులు నీటి ట్యాంకర్లు పంపిస్తున్నారు. ఒక్క రోజు ఆలస్యం కావడం వల్ల పక్కనే ఉన్న వసతి గృహానికి వెళ్లి విద్యార్థినులు స్నానం చేసి వచ్చారు. తాగునీటి కోసం మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

'బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారు'

శంకరపట్నం, ఏప్రిల్ 19: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని హిందూ రాజ్యాంగంగా మారుస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని, ఆ రాజ్యాంగాన్ని మార్చి హిందూ రాజ్యాంగంగా మారుస్తామని స్వయంగా బీజేపీ ప్రకటించడానికి చూస్తే అధికారంలోకి వస్తే అదే జరుగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి తొక్కేస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ ఎత్తుగడలు ఉండవచ్చు కానీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుంటే బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, రవి, సదానందం, బాదుల్లా, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

గన్నేరువరం, ఏప్రిల్ 19: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన న్యాయవాది జేరిపోతుల మహేందర్ నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లో జరిగిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సమావేశంలో జాతీయ, రాష్ట్ర నాయకుల సూచనల మేరకు తనకు అవకాశం కల్పించిన జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ప్రధానకార్యదర్శి మేడి మహేష్, ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్, కాలువల రాంచందర్‌కు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై డీఎల్‌పీవో విచారణ

తిమ్మాపూర్, ఏప్రిల్ 19: మండలంలోని రామకృష్ణాకాలనీ గ్రామంలో ఉపజ్ఞ(శృతిజ్ఞ) హోమ్స్‌లో అక్రమ నిర్మాణాలు నిర్మించినట్లు కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో రాంబాబు శుక్రవారం విచారణ చేపట్టారు. ఉపజ్ఞ హోమ్స్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు సీపీఎం నాయకుడు బోయిని తిరుపతి గత నెల 11న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీవో రాంబాబు క్షేత్రస్థాయిలో విచా రణ జరిపారు. డీఎల్‌పీవో ఉపజ్ఞ హోమ్స్‌కు చేరుకొని పూర్తిగా స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణాలకు సంబంధించిన అన్ని పత్రాలను సమర్పించాలని యాజమన్యాన్ని ఆదేశించారు. దీంతో అన్ని పత్రాలను రెండుమూడు రోజుల్లో ఇస్తామని తెలిపారు. దీనికి అనుమతులు ఏవిధగా ఇచ్చారు, ఎవరు ఇచ్చారు అనే దానిపై డీఎల్‌పీవో విచారణ జరిపారు. ఇందులో ఎస్సారెస్పీ స్థలంతో పాటు, ఇతర ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు కట్టినట్లు, సరైన అనుమతులు లేవని వచ్చిన ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు, అందులో కొన్ని అనుమతి లేని ఇళ్లను గుర్తించినట్లు డీఎల్‌పీవో తెలిపారు. నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శిని డీఎల్‌పీవో ఆదేశించారు. పూర్తి నివేదిక వచ్చిన తరువాత కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు డీఎల్‌పీవో రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో డీపీవో కిరణ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీలో పలువురి చేరిక



పార్టీ కండువా కప్పుతున్న ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 19: మండలంలోని సింగాపూర్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 24వ వార్డుల కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళలు, నాయకులు టీపీసీసీ ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు. నాయకులు సందమల్ల నరేష్, బత్తిని రవీందర్, కిరణ్‌రెడ్డి, సందమల్ల బాబు, దుబాసి బాబు ఉన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటకు చెందిన రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ కౌన్సిలర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ కోడిగూటి మొగిలయ్య కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్, సీనియర్ నాయకుడు దేశిని కోటి పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివసాయి



కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 19: ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ రూరల్ బొమ్మకల్ గ్రామానికి చెందిన కుడిదల శివసాయిని నియమిస్తూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ శుక్రవారం నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివసాయి మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందే విధంగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, జాతీయ కోఆర్డినేటర్, ఏఐసీసీ రీసెర్చ్ విభాగం కాశిపాక రాజేష్, మునుగంటి అనిల్, పురమల్ల శ్రీనివాస్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: ఇటీవల నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (ఐటీఓ)లో పారమిత విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో వెల్ది హర్షిణి (7వ) రాష్ట్రస్థాయి నాల్గవ ర్యాంకు, అర్హాన్ లతీఫ్ (8వ)4వ ర్యాంకు, సామాన్యశాస్త్ర విభాగంలో ఎన్.రుషిక (9వ) ఏడవ ర్యాంకు సాధించి పతకాలు, అవార్డులను స్వంతం చేసుకున్నారని అన్నారు. అలాగే మరో అయిదుగురు విద్యార్థులు స్ఫూర్తి, జి.సహస్ర, ఎస్.సిరి, యశ్మిత్ పటేల్, రిధి పబ్బతి ప్రతిభ కనబరిచి మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచి అవార్డులను అందుకున్న విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుభాష్‌నగర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న అల్లాడి లక్ష్మణమూర్తిని ఘనంగా సన్మానించారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఖాజా నజీరొద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రావు, ఎంఈవో మధుసూధనాచారి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోగులకొండ మోహన్ హాజరై లక్ష్మణమూర్తిని సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు కటకం రమేశ్, గాజుల రవీందర్, మోతె చంద్రశేఖర్ రెడ్డి, జాన్ సుధాకర్, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, ఖాజా మంజూర్ అలీ, అశోక్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్19: కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ విభాగం ఎన్నికల పరిశీలకుడిగా టీపీసీసీ ఎస్‌సీ విభాగం రాష్ట్ర కన్వీనర్, రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన వెన్న రాజమల్లయ్యను నియమిస్తూ టీపీసీసీ ఎస్‌సీ విభాగం అధ్యక్షులు నాగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా వెన్న రాజ మల్లయ్య మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఎన్నికల ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించి, దళితు లను జాగృతం చేసి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతస్థాయిలో తీసుకెళతామన్నారు. దళితుల ఓట్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పెద్ద ఎత్తున పడేట్లు తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ నాగరిగారి ప్రీతం, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు రాజమల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మానకొండూర్, ఏప్రిల్ 19: మానకొండూర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఫసిఅహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సౌర విద్యుత్ వినియోగంపై ప్రత్యేక దృష్టి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 19: రోజురోజుకి సాంప్రదాయ ఇంధన వనరులు క్షీణిస్తున్న దృష్ట్యా సౌర విద్యుత్తు వినియోగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని, సౌర విద్యుత్‌తో పనిచేసే పరికరాలను తయారు చేసేందుకు విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ చేయాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీస్ హైదరాబాద్ సౌజన్యంతో రెండు రోజుల సిస్టమ్ ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర, వాయువు విద్యుత్ శక్తిలను ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్నదన్నారు. ప్రయోగపూర్వకంగా నేర్చుకోవడం ద్వారా విద్యార్థికి మరింత అవగాహన పెరుగుతుందని, సొంతంగా సోలార్ ప్యానల్‌లను ఇన్‌స్టాల్ చేయాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ యోగేష్ పుండలిక్ ఉన్నారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

గన్నేరువరం, ఏప్రిల్ 19: ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తోన్న ఉచిత బస్సు పథకం ఆర్టీసీ నిర్లక్ష్యంతో మండలంలోని మహిళలకు అందని ద్రాక్షగా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు గుండ పర్శరాములు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద మీడియాతో మాట్లాడారు. మండలం ఏర్పాటు కాకముందు రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి నుంచి గన్నేరువరం గ్రామానికి సరిపడా బస్సులు నడిచేవని, నేడు మండలం ఏర్పడినప్పటికీ ఈ రూటు గుండా ఒక్క బస్సు కూడా నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి, గోపాల్‌పూర్, హన్మాజిపల్లి, మాధాపూర్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లడానికి నానా పాట్లు పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి గుండ్లపల్లి నుంచి మండల కేంద్రానికి బస్సులను నడపాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చొప్పదండి, ఏప్రిల్ 19: మండలంలోని కొలిమికుంట, భూపాలపట్నం, గుమ్లాపూర్, వెదురుగట్టలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి శుక్రవారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున రైతులకు తాగునీటి సదుపాయం కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని దింపకుండా ఇబ్బందులు కలిగిస్తే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.